క్లుప్తంగా

ట్రాన్స్‌కో రాష్ట్ర కబడ్డీ జట్టుకు కెప్టెన్‌గా శ్రీనివాస్


శ్రీనివాస్

సీలేరు: తెలంగాణలో సెప్టెంబర్ 1 నుంచి జరగనున్న జాతీయస్థాయి ఎలక్ట్రిసిటీ కబడ్డీ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర జట్టుకు సీలేరు జెన్‌కో ఏడీఈగా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాస్ నియమితులయ్యారు. ఆయనను ఈఈ రాజేంద్రప్రసాద్ తదితరులు అభినందించారు.

మన్యంలో భారీ వర్షం


ఇంటిపై ఒరిగిపోయిన భారీ చెట్టు

రాజవొమ్మంగి/జి.మాడుగుల: మన్యంలో పలుచోట్ల మంగళవారం భారీ వర్షం కురిసింది. రాజవొమ్మంగి మండలం శరభవరం పంచాయతీ ఒకకరాయి గ్రామంలో చింతచెట్టు కూలి ఇంటిపై పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. భారీ వర్షంతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రహదారులు జలమయమయ్యాయి.

మాచ్‌ఖంచ్ ప్రాజెక్టులో చోరీ


స్వాధీనం చేసుకున్న కాపర్‌తో సెక్యూరిటీ గార్డ్

ముంచంగిపుట్టు: మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో కాపర్ చోరీ చేసే వ్యక్తులను ప్రాజెక్టు సెక్యూరిటీ గార్డులు పట్టుకున్నారు. మంగళవారం ప్రాజెక్టులోని కాంట్రాక్టర్ వద్ద పనిచేసే వ్యక్తులు 10 మీటర్ల పొడవు, 30 కిలోల బరువు ఉన్న కాపర్ తీగలను ప్రైవేట్ వాహనంలో తరలిస్తుండగా విద్యుత్‌కేంద్రం సెక్యూరిటీ స్వాధీనం చేసుకున్నారు. ప్రాజెక్టు ఈఈ జనరేషన్ గొవిందరాజులు ఆదేశాల మేరకు పట్టుకున్న కాపర్ దొంగలను పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్లపై దమ్ము ట్రాక్టర్లు నడిపితే చర్యలు

రాజవొమ్మంగి: రహదారులపై దమ్ము ట్రాక్టర్లను నడిపితే చర్యలు తప్పవని జడ్డంగి ఎస్‌ఐ చినబాబు ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులకు హెచ్చరించారు. ఆయన మంగళవారం జడ్డంగి స్టేషన్ పరిధిలోని ట్రాక్టర్ యజమానులతో సమావేశమయ్యారు. ట్రాక్టర్లకు టైర్లు తొలగించి కేవలం ఇనుప చక్రాలతో రహదారులపై తిరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రహదారులను కాపాడుకోవాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. లోదొడ్డి సర్పంచ్, రాష్ట్ర గిరిజన సంఘం అధ్యక్షుడు లోతా రామారావు దమ్ము ట్రాక్టర్లు రోడ్లపైకి వచ్చి రోడ్లను ఛిద్రం చేస్తున్నాయని ఎస్‌ఐ చినబాబుకు ఇటీవల ఫిర్యాదుచేయడంతో ఈ సమావేశం ఏర్పాటు చేసి ఈ మేరకు హెచ్చరికలు జారీ చేశారు. దమ్ము ట్రాక్టర్లపై నిఘా ఉంటుందని ఎస్‌ఐ చినబాబు చెప్పారు.

విద్యార్థులకు బహుమతులు


బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

అరకులోయ టౌన్/డుంబ్రిగుడ: అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం గ్రంథాలయ దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ ఆదేశాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ తదితర పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు గణేష్, గ్రంథాలయ ఇన్‌చార్జి డాక్టర్ పి.కొండబాబు, ఎన్‌ఎస్‌ఎస్ పీవో అనిత కుమారి, రాజు, లచ్చన్న, సునీల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను సందర్శించిన ఏడీఎంహెచ్‌వో


పీహెచ్‌సీని పరిశీలిస్తున్న ఏడీఎంహెచ్‌వో డాక్టర్ డేవిడ్

రాజవొమ్మంగి: రంపచోడవరం ఏడీఎంహెచ్‌వో డాక్టర్ డేవిడ్ మంగళవారం రాజవొమ్మంగి, జడ్డంగి పీహెచ్‌సీలను సందర్శించారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అంతకు ముందు ఆయన రాజవొమ్మంగి ఏకలవ్య పాఠశాలలో జరుగుతున్న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని పరిశీలించారు. రాజవొమ్మంగి 24 గంటల పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ జరిగేలా చూడాలని ఎంపీటీసీ సభ్యుడు పెద్దిరాజు కోరారు.

నులిపురుగుల నిర్మూలనతోనే ఆరోగ్యం


జర్రాయి పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


పెదబయలులో విద్యార్థులకు మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి నిఖిల్ తదితరులు


బొండాపల్లిలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యుడు చైతన్యకుమార్


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సతీష్


గాంధీనగరంలో పాఠశాలలో విద్యార్థినులకు మాత్రలు అందిస్తున్న వైద్యులు


దాలిపాడులో పిల్లలకు నులిపురుగులు నివారణ మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి దినేష్


కొత్తూరు నారాయణపురంలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యులు

డుంబ్రిగుడ: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలనతోనే చిన్నారులకు ఆరోగ్యం కలుగుతుందన్నారు. నులిపురుగుల వల్ల చిన్నారుల రక్తహీనత సంభవిస్తుందని, దీని వల్ల నీరసం, తరచూ రోగాల బారిన పడే ప్రమాదముందన్నారు. డుంబ్రిగుడ మండలంలోని జరిగిన కార్యక్రమంలో వైద్యులు పి.రాంబాబు, నజీబ్, పీహెచ్‌ఎన్ జానకి, ఎంపీహెచ్‌వో సన్యాసిరావు పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారులు నిఖిల్, చైతన్య కుమార్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఫ్యామిలీ వెల్ఫేర్ రాష్ట్ర కమిషనర్, ట్రైబల్ హెల్త్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.రమేష్‌బాబు జి.మాడుగుల, చింతపల్లి మండలాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలను ఆయన సందర్శించారు. వైద్య సేవలు పరిశీలించి ప్రసవాలు, బర్త్ వెయింట్ రూమ్‌ల పరిస్థితులు ఆయన తనిఖీ చేశారు. వైద్య సేవలు నాణ్యతపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. వైద్యులు కిశోర్, పి.నారాయణరావు, ఎంపీహెచ్‌ఈవో నడిగట్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. వై.రామవరం: మండలంలోని జరిగిన కార్యక్రమంలో వైద్యులు దినేష్, నరేంద్ర, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలోని జరిగిన కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పండా సతీష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: మండలంలోని జరిగిన కార్యక్రమంలో వైద్యురాలు విష్ణుప్రియ, సర్పంచ్ అలివేలు, హెచ్‌వి సత్యవాణి, సిబ్బంది భారతి, సమ్మక్క, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి కృషి


మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైస్ ఎంపీపీగా ఒంటుబు ప్రియంక రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీ అయిందని, ఈ సందర్భంగా నిర్వహించే ఎన్నికలో వైఎస్సార్‌సీపీ బలపర్చే అభ్యర్థి విజయం సాధించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్సీ రవిబాబు పరామర్శ


వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పాలుని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

అరకులోయ టౌన్/డుంబ్రిగుడ: ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ వైద్యుల సూచనల మేరకు తన స్వగ్రామం బెంజిపురంలో విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, అల్లూరి జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పాలును మంగళవారం ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు పరామర్శించారు. శెట్టి అప్పాలు సతీమణి, వైఎస్సార్‌సీపీ అరకు మాజీ సమన్వయకర్త కె.అరుణకుమారితో రవిబాబు మాట్లాడారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలో వైద్యుల ద్వారా చికిత్స అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. చిన్నారావు, సుందరరావు, ప్రకాష్, గోపాల్, అర్జున్, గురు, బేసు, చిన్నయ్య తదితరులున్నారు.

గ్రామాల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీలు


గంగవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, బీజేపీ నాయకులు

గంగవరం : మండల కేంద్రంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు నీలాలమ్మ, కొండలు దొర మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. స్వతంత్ర సమరయోధులు త్యాగాలను విద్యార్థులకు వివరించారు. నాయకులు వెంకటేశ్వర్లు, అబ్బాయిరెడ్డి, శ్రీను, పాపారావు, పావని, రమేష్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, సుధా తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా రహిత సమాజానికి చర్యలు


మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ రామచంద్రమూర్తి

చింతపల్లి: ఏజెన్సీలో ప్రజలందరి సహకారంతో పూర్తిస్థాయిలో నాటుసారా రహిత సమాజానికి చర్యలు తీసుకుంటున్నట్లు విశాఖ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ రామచంద్రమూర్తి చెప్పారు. లంబసింగి పంచాయతీ కేంద్రంలో మంగళవారం గిరిజనులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటు సారా తాగి గిరిజనులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రస్తుతం కేసులు నమోదయితే బెయిల్ వచ్చే అవకాశం కూడా లేదన్నారు. అనకాపల్లి అసిస్టెంట్ కమిషనర్ మహేష్, చింతపల్లి, పాడేరు, నర్సీపట్నం సీఐలు కూర్మారావు, గౌరీశ్వరరావు, శ్యామల, సర్పంచ్ శాంతికుమారి, వైద్యాధికారి దినేష్, ఎస్‌ఐలు రాంబాబు, వెంకటరమణ, డీటీ నరేంద్ర పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్‌ఐ అప్పలసూరి, పోలీసులు


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ కన్నపరాజు

ఎటపాక: డ్రైవర్లు రహదారి భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఎటపాక సీఐ కన్నపరాజు సూచించారు. ఆటో డ్రైవర్లుకు మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. వాహనచోదకులు తప్పనిసరిగా లైసెన్స్, ఇతరత్రా వాహనపత్రాలు లేకుండా ప్రయాణించొద్దని సూచించారు. ఎస్‌ఐ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మద్యం మత్తులో వాహనాలు నడిపి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ అప్పలసూరి చెప్పారు. మద్యం మత్తులో ప్రమాదాలు జరిగి అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మండల కేంద్రంలో ఆయన రోడ్డు ప్రమాదాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలతో కూడిన పోస్టర్‌ను విడుదల చేశారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఎస్‌ఐ పాపినాయుడు ఆధ్వర్యంలో మంగళవారం వాహనచోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపవద్దన్నారు. రహదారి భద్రత నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి చేయూత


బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు: చింతపల్లి మండలానికి చెందిన గోకాడ నాగరాజు గతేడాది మార్చి 24న సహజ మరణానికి గురయ్యాడు. పీఎంజేజే పథకం ద్వారా మృతుడికి మంజూరైన రూ.2లక్షల చెక్కును మృతుడి కుమారులు చరణ్, తేజలకు కలెక్టర్ దినేష్‌కుమార్ అందజేశారు. లీడ్ బ్యాంకు మేనేజర్ నాయుడు, చింతపల్లి యూబీఐ మేనేజర్ గౌతమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : మండల కేంద్రంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో హ్యూమన్ క్యాపిటల్ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వర్క్‌షాపు కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ సాంకేతిక విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు.డీఈవో బ్రహ్మాజీరావు, సర్వశిక్ష ఏపీసీ స్వామినాయుడు, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరామ్ పడాల్, టీడబ్ల్యూ ఇన్‌చార్జి డీడీ క్రాంతికుమార్, ఏఐ కో–ఆర్డినేటర్ భాస్కర్‌రావు, సీఎంవో జ్ఞానప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధన అందించాలి


బొర్రిలో గిరిజనులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్

చింతపల్లి: మండలంలోని లోతుగెడ్డ, వంగశార, లంబసింగి, చింతపల్లి ప్రాంతాల్లో పాఠశాలలను అసిస్టెంట్ కలెక్టర్ కె.సాహిత్ మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని, ఉత్తమ ఫలితాలకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. డ్రాప్‌అవుట్స్ లేకుండా చూడాలని ఆదేశించారు. ఎంఈవో బోడంనాయుడు, ఐసిడిఎస్ పీవో శ్రీదేవి,వాసవ్య మహిళా మండలి కో–ఆర్డినేటర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి నిధులు


ఉరిసింగిలో డ్రైనేజి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్


దుడుమ బస్ షెల్టర్‌కు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ మిల్కి, వైస్ ఎంపీపీ భాగ్యవతి, నేతలు

చింతపల్లి: మండలంలో గల అన్ని గ్రామాల్లో పూర్తిస్థాయి డ్రైనేజి, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు జిల్లా పరిషత్ నిధులు మంజూరైనట్టు జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యపడాల్, ఎంపీపీ కోరాబు అనూషదేవి చెప్పారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని మామిడిపల్లి, ఉరిసింగి గ్రామాల్లో రూ.10 లక్షల జిల్లా పరిషత్ నిధులతో డ్రైనేజి నిర్మాణానికి భూమి పూజ చేశారు. సర్పంచ్ వనగల సోమరత్నం, వైస్ సర్పంచ్ గోపీనాయక్ శారద, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి బెన్నిబాబు, రైతు విభాగ కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు గణేష్, భీమరాజు పాల్గొన్నారు.

దుడుమలో బస్‌షెల్టర్‌కు శంకుస్థాపన

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన వనుగుమ్మ పంచాయతీ డుడుమ జలాశయం సమీపంలో జెడ్పీ నిధులు రూ.5లక్షలతో బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ కిరసాని మిల్కి, వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి, వైఎస్సార్‌సీపీ నేతలు పూజలు చేసి మంగళవారం శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించారు. బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకెళ్లగా స్పందించి రూ.5లక్షలను మంజూరు చేయడం హర్షణీయమని సర్పంచ్ కిరసాని మిల్కి, వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి, నాయకులు చెప్పారు. ఈ సందర్భంగా స్థానికులు తదితరులు జెడ్పీ చైర్‌పర్సన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, నాయకులు జగబంధు, మూర్తి, తిరుపతి, రాంప్రసాద్, నీలకంఠం, దేవా, పంచాయితీ అధ్యక్షులు రాజేంద్ర, కార్యదర్శులు గోపాల్, సుభాష్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో మధుసూదనరావు


వాతంగిలోవరి నాట్లు వేస్తున్న రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ చక్రధర్

చింతపల్లి: యాజమాన్య పద్ధతుల సాగుతో గిరిజన రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖాధికారి టి.మధుసూదనరావు అన్నారు. కొమ్మంగి పంచాయతీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చునన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం సేంద్రియ విభాగ శాస్త్రవేత్త సందీప్ నాయక్, పశువైద్యాధికారి షాలిని, ఏఏ విశ్వేశ్వరరావు, ఏఈవో ధర్మారాయ్, వి.ఎ.గాంధీ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో లాభాలు

రాజవొమ్మంగి: మండలంలోని లోదొడ్డి, వాతంగి గ్రామాల్లో జరిగిన రైతు సదస్సుల్లో ఏవో చక్రధర్ మంగళవారం పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ సేంద్రియ సాగుతో లాభాలు పొందవచ్చన్నారు. గ్రామాల్లోని వరినాట్లును పరిశీలించి, రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సర్పంచ్ లోతా రామారావు, వీపీఏ రాజు, ఏపీసీఎన్‌ఎఫ్. సిబ్బంది, టాటా ట్రస్ట్ ప్రతినిధులు హాజరయ్యారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

రాజవొమ్మంగి: మండంలోని లాగరాయి గ్రామంలో తాగునీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఐటీడీఏ పీఓ కట్టా సింహాచలం హామీ ఇచ్చినట్టు సర్పంచ్ గణలక్ష్మి అన్నారు. రంపచోడవరంలో మంగళవారం జరిగిన ఐటీడీఏ పీవోతో జరిగిన సర్పంచ్‌ల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. లాగరాయి గ్రామంలోని వెలమలపేటలో నెలకొన్న తాగునీటి సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన పీఓ పాడైన్ పైపులైన్లు, తాత్కాలిక వాటర్ ట్యాంకు నిర్మాణానికి అంచనాలు వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారని, త్వరలో సమస్య పరిష్కారం కానున్నట్టు సర్పంచ్ గణలక్ష్మి చెప్పారు. సర్పంచ్‌లు శుభలక్ష్మి, మురళికృష్ణ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వి.ఆర్.పురం: మండలంలోని సున్నంమట్కా, దర్భలంక, వెంకంపాలెం, గొత్తికోయ గ్రామాల్లో చిన్నమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు మంగళవారం పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామన్నారు. జయరాజ్, నాగేశ్వరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవో దృష్టికి సమస్యలు

గంగవరం : గంగవరం పంచాయతీలో నెలకొని ఉన్న పలు సమస్యలను ఐటీడీఏ పీవో సింహాచలం దృష్టికి తీసుకువెళ్లినట్టు గంగవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా గ్రామంలో తాగునీటి సమస్య, సీసీ రోడ్లు, డ్రైనేజీల సమస్యలను పీవోకు తెలియజేశామన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు.

రైతుల భూములకు ప్రభుత్వ రక్షణ

వి.ఆర్.పురం: బ్యాక్ వాటర్ వచ్చే వరకు పోలవరం నిర్వాసిత గిరిజనేతర రైతుల భూములకు ప్రభుత్వమే రక్షణ కల్పిస్తుందని బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం వెంకయ్య, జిల్లా కార్యదర్శి బుర్ర కామేశ్వరి అన్నారు. పార్టీ నాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పూర్తయి నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలించేవరకు వారి భూములకు ప్రభుత్వం రక్షణ కల్పిస్తుందన్నారు. శ్రీరామగిరి, సీతంపేట, వడ్డుగూడెం గ్రామాల్లోని గిరిజనేతరులు ఆందోళన చెందవద్దన్నారు. నాయకులు రాంబాబు, రత్తయ్య, పవన్ కుమార్, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంగా ప్రకటించాలి

హుకుంపేట: ఉప్పని మండల కేంద్రంగా ప్రకటించాలని మండలంలో ఒల్దా పంచాయతీ పరిధిలోని గల వివిధ గ్రామాల్లో ఉప్ప మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో గిరిజనులు మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం మండల సాధన కమిటీ సభ్యులు నారాయణరాజు మాట్లాడుతూ ప్రస్తుతం మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వెళ్లేందుకు సమారు 30 నుంచి 40 కిలో మీటర్లు ప్రయణించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు, కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవతీసుకుని ఉప్పని మండల కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు దేముడు ,తౌడన్న, గోపాల్‌పాత్రుడు, సింహచలం తదితరులు పాల్గొన్నారు.

పీ-4 సర్వే వేగవంతం చేయాలి

గూడెంకొత్తవీధి: పీ–4 సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు. ఆయన కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పీ–4ను వేగవంతం చేయాలన్నారు. తల్లికి వందనం నిధులపై ఈకేవైసీని పూర్తి చేయాలని, జాప్యం చేయవద్దని సూచించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలని కోరారు. హర్ ఘర్ తిరంగాపై ప్రచారం చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో మహేశ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల నిరసన

చింతూరు: నలభై ఏళ్లుగా ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న తమను ఫ్రీ బస్సు పేరుతో అన్యాయం చేయొద్దని ఆటోడ్రైవర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం డివిజన్ ఆటో, టాటా మ్యాజిక్‌ల డ్రైవర్లు చింతూరులో విలేకరులతో మాట్లాడుతూ ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. ఆటో యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, జవహర్, శేఖర్, రమేష్, సలీం, రాంబాబు, సత్తిబాబు, కోటి పాల్గొన్నారు.

కళాశాలలో అల్లూరి విగ్రహావిష్కరణ

చింతపల్లి: స్థానిక డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు స్థానిక హనుమాన్ జంక్షన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసపాత్రుడు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

పాడేరు/పాడేరు రూరల్ : అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం పాడేరులో ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకుడు అమర్‌జ్యోతి స్థానిక నాయకులతో కలిసి ఏఐఎస్‌ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాల్లో విద్యార్థులు సమస్యలతో సహవాసం చేస్తున్నా, కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న జీఓలను తక్షణమే రద్దు చేయాలన్నారు. విద్యారంగ సమస్యలపై ఏఐఎస్‌ఎఫ్ అవిశ్రాంతంగా పోరాటాలు చేస్తోందన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి , నాయకులు రాజశేఖర్, కృష్ణ, జగదీష్, ఇసాక్, బాలు, విద్యార్థులు పాల్గొన్నారు.